క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌లో కందుకూరు సెక్టార్‌కు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 26 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్లు చాలీ చాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వాలు పని భారాన్ని పెంచుతూ ఇబ్బందులు కలిగిస్తున్నాయన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. అంగన్‌వాడీలు ఐక్యతతో పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధిక, సరస్వతి, దేవి, రాణి, కల్పన, సరళ, కవిత, అమృత తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికను విజయవంతం చేయాలి

మున్సిపల్ కమిషనర్ వాణి



మాట్లాడుతున్న కమిషనర్ వాణి

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మున్సిపల్ వ్యాప్తంగా చేపట్టనున్న 100 రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలని కమిషనర్ ఏ.వాణి పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో 100 రోజుల కార్యక్రమంపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 02వ తేదీ నుంచి సెప్టెంబర్ 10 వరకు నిర్వహిస్తున్నామన్నారు. 100 రోజుల పాటు ఒక మార్పు–అభివృద్ధికి మలుపు అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. పారిశుద్ధ్యం, మౌళిక సదుపాయాల కల్పన, ఆర్థిక వృద్ధి, తడి, పొడి చెత్త వేరు చేయడం, వన మహోత్సవం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జూన్ 2వ తేదీన మున్సిపాలిటీలో ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, ఏఈ గుణాకర్, సీనియర్ అసిస్టెంట్లు మల్లేశ్, స్ఫూర్తి, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి సర్వే

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి నంది హిల్స్ కాలనీలో అధికారులు కాలనీవాసులతో కలిసి పర్యటించి రోడ్ల అభివృద్ధికి గాను శనివారం సర్వే నిర్వహించారు. టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తన కార్పొరేషన్ నుంచి కాలనీ అభివృద్ధికి రూ.6కోట్ల నిధులు కేటాయించినట్లు ఈ సందర్భంగా కాలనీవాసులు తెలిపారు. 24 రోడ్లకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన కమిషనర్ జ్ఞానేశ్వర్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సర్వేలో కాలనీవాసులు సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆనందం, సురేష్, రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా మహేశ్‌గౌడ్

హస్తినాపురం: వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా తోట మహేశ్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతిరోజు వాహనాల తనిఖీలు చేపట్టి నేరాల నియంత్రణకు పాటు పడుతామన్నారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పెంచుతామన్నారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో శ్రీనేత్రాలయ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి తెలిపారు.

శిథిలావస్థలో భవనాలు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వర్షాకాలంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండ చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలతో సర్కిళ్ల వారీగా పురాతన భవనాలను గుర్తించారు. మొత్తం జోనల్ పరిధిలో 32 భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు టౌన్‌ప్లానింగ్ అధికారుల సర్వేలో వెల్లడైంది. ఈ సారీ భారీ వర్షాల కురుస్తాయని పురాతన భవనాల్లో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. జోనల్ పరిధిలో ఐదు సర్కిళ్లలో సుమారుగా 29 భవనాలను గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు వాటికి నోటీసులు జారీ చేసే ప్రక్రియలో ఉన్నారు. శిథిల భవనాలు కాప్రా సర్కిల్‌లో–2, ఉప్పల్–3, ఎల్‌బీనగర్ సర్కిల్–3లో– 3, ఎల్‌బీనగర్ సర్కిల్–4లో 14, సరూర్‌నగర్ సర్కిల్‌లో–7లో ఉన్నాయి.

కల.. సాకారం

- పురపాలికకు 200 ఇళ్ల కేటాయింపు
- లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత
- జోరుగా 'ఇందిరమ్మ' నిర్మాణాలు

తుక్కుగూడ: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తుక్కుగూడ మున్సిపాలిటీకి మొదటి విడతగా 200 ఇళ్లు మంజూరు చేసింది. 15 వార్డుల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు పురపాలిక అధికారులు ప్రారంభించారు. 400 నుంచి 650 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించేలా ముగ్గుపోసి నిర్మాణ పనులు ప్రారంభం, మంజూరు పత్రాల అందజేత సందడి కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ప్రభుత్వం ఇంటిని నిర్మించి ఇస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్పష్టంచేస్తున్నారు. లబ్ధిదారులు ఆనందంగా ఇంటిని నిర్మించుకోవాలని సూచిస్తున్నారు.

వార్డు	మంజూరైన ఇళ్లు
1	07
2	15
3	18
4	15
5	09
6	15
7	18
8	12
9	10
10	17
11	15
12	01
13	10
14	10
15	14
హర్షగూడ (విలీనం గ్రామం)	14



మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు

ప్రత్యేక కార్యదర్శి పర్యటన

తుక్కుగూడలో అధికారులు చేపట్టిన ఇళ్ల సర్వేను ఏప్రిల్ 29న రాష్ట్ర హౌసింగ్ బోర్డు స్పెషల్ సెక్రటరీ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి పరిశీలించారు. అర్హుల ఎంపికలో పారదర్శకతను పాటించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది 270 మంది అర్హులను గుర్తించారు. అనంతరం తొలి విడతలో 200 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 60 శాతం మేర నిర్మాణాలను లబ్ధిదారులు ప్రారంభించారు.

విడతల వారీగా

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి నాలుగు విడతల్లో రూ.5 లక్షలు మంజూరు చేయనుంది. ఇంటి నిర్మాణంలో బేస్‌మెంట్ వరకు పూర్తయితే రూ.లక్ష, రూఫ్ లెవల్ వరకు రూ.1.25 లక్షలు, స్లాబ్ పూర్తయితే 1.75 లక్షలు, ఇల్లు పూర్తి అయిన అనంతరం మరో లక్ష చొప్పున ఇవ్వనుంది.



సర్వేను పరిశీలిస్తున్న హౌసింగ్ బోర్డు ప్రత్యేక కార్యదర్శి గౌతమ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్(ఫైల్)

పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయండి

చాదర్‌ఘాట్: వారం రోజులు ట్రాఫిక్ పరిస్థితి ఇదే విధంగా ఉంటుందని వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వెళ్లాలని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ అన్నారు. శనివారం నల్గొండ చౌరస్తాలోని అక్బర్ ప్లాజా జాతీయ రహదారిపై డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి రహదారిపై డ్రైనేజీ రోడ్డుపై పారుతున్న ప్రాంతాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ పరిశీలించారు. దాదాపు రెండు మీటర్లు పొడవు వెడల్పుతో రంధ్రం పడటంతో ట్రాఫిక్ జామై కిలో మీటర్ల మేర స్తంభించింది. వాహనదారులు అజంపురా నుంచి మలక్‌పేట యశోద హాస్పిటల్, మూసారాంబాగ్ దారుల్లో వెళ్లారు. జాతీయ రహదారి కావడంతో భారీ సంఖ్యలో వాహనాలు వస్తాయని వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని హైడ్రా కమిషనర్ సూచించారు. పై నుంచి వచ్చిన వరద, మురుగు నీరును సాఫీగా మూసీలో కలిపే జంక్షన్ లైను దెబ్బతినడంతో ఈ సమస్య తలెత్తుతందని తెలుసుకున్న ఆయన దాని పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. దాదాపు వంద మీటర్ల మేర ఉన్న పైప్‌లైన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తను తొలగించడానికి హై ప్రెజర్ జెట్టింగ్ మిషన్లతో ప్రయత్నించాలని అధికారులకు సూచించారు.



డ్రైనేజీ పైప్‌లైన్ స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్, గ్రేటర్ కమిషనర్

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి



ఆలయ పాలక మండలి సభ్యులతో మధుయాష్కీగౌడ్, ఈఓ లావణ్య

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకునే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని.. కబ్జాకు గురైన సుమారు 10 ఎకరాల ఆలయ భూమిని స్వాధీనం చేసుకుని బాధ్యత ఆలయ పాలక మండలి సభ్యులపై ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం జిల్లా ఎండోమెంట్ అధికారి చంద్రశేఖర్ సమక్షంలో ఆలయ ఈఓ లావణ్య చేత సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ ఈకార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వరరెడ్డి, మిద్దెల జితేందర్, ఏసీపీ కృష్ణయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మరిన్ని నిధులు..

వనస్థలిపురం: ప్రభుత్వం ఇప్పటికే ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభివృద్ధికి రూ. 180 కోట్ల నిధులు వెచ్చించిందని, మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురంలోని బీకేఎస్ గ్రౌండ్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. బీకేఎస్ గ్రౌండ్‌లో పార్కు సుందరీకరణ, వాకింగ్ ట్రాక్, యోగా షెడ్డు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాత నాయక్, నాయకులు స్వర్ణమాధవి, కుట్ల నరసింహాయాదవ్, నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

మలక్‌పేటలో ట్రాఫిక్ మళ్లింపు

ఆదివారం సాయంత్రం వరకు ఆంక్షలు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని అక్బర్‌ప్లాజా బిల్డింగ్ వద్ద భారీ సివరేజీ వాటర్ లీకేజీకి మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో మలక్‌పేటలో ట్రాఫిక్ మళ్లింపు చేసినట్లు ట్రాఫిక్ పోలీస్ విభాగం జాయింట్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆంక్షలు శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ఉంటాయన్నారు.

మళ్లింపు మార్గాలు..

- ఎంజీబీఎస్ నుంచి విజయవాడ, సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను చాదర్‌ఘాట్ క్రాస్ రోడ్ వైపు వెళ్లకుండా చాదర్‌ఘాట్ రోటరీ వద్ద మళ్లిస్తారు. బస్సులు నింబోలిఅడ్డ, అంబర్‌పేట న్యూ ఫ్లైఓవర్, రామాంతపూర్, ఉప్పల్, ఎల్‌బీనగర్ మీదుగా విజయవాడ జాతీయ రహదారిపై నుంచి వెళ్లాల్సి ఉంటుంది.
- కల్వకుర్తి, దేవరకొండ, శ్రీశైలం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సైతం అదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది.
- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అన్ని ఆంక్షలు విధించిన సమయంలో హైదరాబాద్ నగర పరిధుల నుంచి లోపలికి అనుమతించరు.
- దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, సైదాబాద్, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను చాదర్‌ఘాట్ క్రాస్ రోడ్ వద్ద మళ్లిస్తారు. అవి నింబోలిఅడ్డ, 6 నెంబర్ జంక్షన్, న్యూగోల్నాక బ్రిడ్జ్, మూసారాంబాగ్ ఆర్టీఏ, మూసారాంబాగ్ క్రాస్‌రోడ్ వద్ద దిల్‌సుఖ్‌నగర్ వైపుకు ఎడమ వైపు, నల్గొండ చౌరస్తా, చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్‌సదన్ వైపు వెళ్లేందుకు కుడి వైపు మళ్లాలి.
- ట్రాఫిక్ మళ్లింపులు కారణంగా ఎంజే మార్కెట్, కోఠి, రంగ్‌మహల్ క్రాస్‌రోడ్, చాదర్‌ఘాట్, ఎస్‌జే రోటరీ, నింబొలిఅడ్డ, గోల్నాక తదితర ప్రాంతాల్లో కొంత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున వాహనదారులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ దారులు చూసుకోవాలని ఆయన సూచించారు.

భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవరక్షేత్ర శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ నూతన చైర్మన్‌గా దేవరం లింగారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ చైర్మన్ పూర నర్సింహగుప్తా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్తా పాల్గొని లింగారెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ప్రతిష్టను కాపాడుతూ భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గతంలో తరహా ఆలయంలో నిత్యం సత్యనారాయణ స్వామి వ్రతాలు, కార్తిక మాసం సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు చకిలం రమణయ్య, సూరిశెట్టి వీరేశం, వీఎస్ఎన్ శ్రీనివాస్, చిదర నాగేందర్, వసంతమనోహర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ శాశ్వత పరిష్కారానికి చర్యలు



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్‌లో వేధిస్తున్న డ్రైనేజీల సమస్యల శాశ్వత పరిష్కారాలకు చర్యలు తీసుకుంటామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆమె వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి భూలక్ష్మీనగర్ బస్తీలో పర్యటించారు. బస్తీలో డ్రైనేజీలు పొంగి మురుగు పారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు విన్నవించగా సిబ్బందిని పిలిపించి మరమ్మతు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్, బస్తీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: తమ తమ ఇళ్ల ముందు నిర్మించుకున్న ర్యాంపులను తొలగించి అంతర్గత రోడ్ల విస్తరణకు సహకరించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీ రెండవ గేటు నుంచి ప్రధాన రోడ్డు వరకు చేపడుతున్న అంతర్గత లింక్ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ రోడ్డు ఏర్పాటుతో చిత్రసీమ కాలనీ, జడ్జెస్‌కాలనీ, వివేకానందనగర్ కాలనీవాసులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు, జియో స్తంభాలను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, సయ్యద్‌జానీ, దామోదర్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, నరేష్, గిరి, యాదగిరేందర్ రావు, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లోనే విధులు!

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. 105 సంవత్సరాల నిజాం కాలం నాటి భవనంలోనే ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లు అత్యాధునిక సౌకర్యాలు కల్పించి చాదర్‌ఘాట్ ఠాణాను విస్మరించారు. సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలో మలక్‌పేట, మాదన్నపేట, సంతోష్‌నగర్ తదితర ఠాణాలు విశాలమైన స్థలంలో అధునాతన వసతులతో రెండు, మూడు అంతస్తుల్లో ఏర్పాటయ్యాయి. స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వాహనాన్ని సైతం రోడ్డు పైనే పార్క్ చేయాల్సిన దుస్థితి నెలకొంది.

రోడ్డుపైనే పార్కింగ్..

దశాబ్ద కాలంగా పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణానికి అడుగులు ముందుకు సాగడం లేదు. చాదర్‌ఘాట్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న నిజాం కాలం నాటి పాత భవనంలోనే స్టేషన్ కొనసాగుతుంది. పురాతన భవనం కావడంతో సరైన సదుపాయాలు లేవు. పార్కింగ్ సదుపాయం లేక ఠాణా సిబ్బంది అధికారులు తమ వాహనాలను రోడ్డు పైనే నిలుపుతున్నారు. పలు కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలను సైతం రోడ్డు పైనే పెడుతున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అరకొర గదుల్లో ఇన్‌స్పెక్టర్లు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్లు, క్రైం, కోర్టు సిబ్బంది సర్దుకొని విధులు నిర్వహిస్తున్నారు. వర్షం కురిస్తే భవనం గోడల వెంబడి నీరు లోపలికి చేరుతుంది. పైకప్పు నుంచి ఎప్పుడు పెచ్చులు ఊడి పడుతాయో తెలియని దుస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. భవనం పక్కనే విద్యుత్ నియంత్రిక ప్రమాదకరంగా మారింది. నూతన భవనం నిర్మాణానికి గతంలో పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడంతో నల్గొండ చౌరస్తాలోని బధిరుల పాఠశాల ప్రాంగణం, మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం, జైల్‌గార్డెన్ వంటి స్థలాలను సైతం పరిశీలించినా ఎలాంటి పురోగతి లేదు.

చాదర్‌ఘాట్ ఠాణాలో సౌకర్యాలు కరువు

ఇన్‌స్పెక్టర్	–	1
డీఐ	–	1
సెక్టార్ ఎస్ఐలు	–	5
ఏఎస్ఐలు	–	6
హెడ్ కానిస్టేబుళ్లు	–	12
కానిస్టేబుళ్లు	–	60

ప్రభుత్వ స్థలం.. కబ్జా పర్వం



జడ్జెస్‌కాలనీలోని పార్కు స్థలంలో నిర్మిస్తున్న మందిరం

- అన్యాక్రాంతమవుతున్న ఖాళీ స్థలాలు
- ఫిర్యాదు చేస్తున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ స్థలాలపై పర్యవేక్షణ లేక కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పార్కు స్థలాలు, కాలనీ అవసరాల దృష్ట్యా వదలిన ఓపెన్ ప్లాట్లు అన్యాక్రాంతం అవుతున్నాయి. భూకబ్జాదారులు ఆయా స్థలాలను అప్పనంగా ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారు. కబ్జాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. – మన్సూరాబాద్



రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో వేసిన ఫెన్సింగ్



గత ఏడాది చేపట్టిన నిర్మాణం కూల్చివేత

ఫెన్సింగ్ చేసి..

మన్సూరాబాద్ గ్రామ సర్వే నెంబర్ 32,33,34,35లోని జడ్జెస్‌కాలనీ ప్రధాన రోడ్డు పక్కలో ఉన్న సుమారు 200 గజాల రోడ్డు స్థలాన్ని ఓ వ్యక్తి ఫెన్సింగ్ వేశాడు. గతేడాది నవంబర్‌లో సదరు స్థలం ఆక్రమణకు గురవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్థలాన్ని పరిశీలించి నిర్మాణాలను కూల్చివేయించారు. ఆరు నెలల్లోనే మళ్లీ అక్కడే ఫెన్సింగ్ వేశాడు.

ప్రహరీ కూల్చి..

జడ్జెస్‌కాలనీలోని ఓ పార్కు స్థలంలో దేవాలయానికి పూనుకున్నారు. జీహెచ్ఎంసీ నిర్మించిన ప్రహరీల కూల్చివేసి దేవాలయం నిర్మాణం చేపట్టడంపై సమీప కాలనీలవాసులు మండిపడుతున్నారు. పార్కు స్థలంలో మందిరాన్ని ఎలా నిర్మిస్తారని, జీహెచ్ఎంసీ సమాచారం అందించకుండా దేవాలయం నిర్మాణం చేపడుతారని సమీప కాలనీలవాసులు ప్రశ్నిస్తున్నారు.

అద్దెకిచ్చి..

మన్సూరాబాద్ చౌరస్తాలో 100 గజాల స్థలం ఆక్రమణకు గురవుతుంది. గతంలో ఈ స్థలం కబ్జాకు గరి కాకుండా వాటర్ ఏటీఎంను ఏర్పాటు చేశారు. వాటర్ ఏటీఎం విద్యుదాఘాతంతో దగ్ధం కావడంతో ఈ స్థలం ఖాళీగా ఉంది. ఖాళీగా ఉన్న స్థలంపై కొందరి కన్నుపడి కబ్జాకు తెర లేపారు. ఈ స్థలాన్ని ఓ పంక్షర్ దుకాణానికి అద్దెకిచ్చారు.

అధికారుల మౌనం..

హిమపురికాలనీలోని 600 గజాల పార్కు స్థలంపై వివాదం నడుస్తుంది. కాలనీవాసులు పార్కు స్థలంగా పేర్కొంటూ జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలంపై జీహెచ్ఎంసీ అనుమతులు ఇవ్వడంతో నిర్మాణం చేపడుతున్నాడు. హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జాదారులకు మద్దతు పలుకుతున్నారని ఆరోపణలు వస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఉన్నతాధికారులు, హైడ్రా అధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఆయా కాలనీల వాసులు పేర్కొంటున్నారు.

మా దృష్టికి రాలేదు

ప్రభుత్వ స్థలాలు కబ్జా అవుతున్నట్లు మా దృష్టికి రాలేదు. రికార్డులు పరిశీలించి కబ్జాదారులపై చర్యలు చేపడుతాం. ప్రభుత్వ స్థలాలను కబ్జాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. – అక్బర్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్